# వడదెబ్బతో వృద్ధుడి మృతి

**బలగం టీవీ, బోయినిపల్లి;**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం బూరుగుపల్లి గ్రామంలో గౌడ కుటుంబానికి చెందిన పెరుమాండ్ల సంజయ్య (78) గత కొంత కాలంగా విపరీతమైన ఎండలకు తట్టు కోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.బుధవారం రోజున తీవ్ర అస్వస్థతకు గురి అయి రాత్రి 7 గంటలకు ఇంటి వద్ద మృతి చెందినట్లు పేర్కొన్నారు.

# రాయదుర్గంలో ఎకరా భూమి రూ. 237 కోట్లు

**- టీజీఐఐసీ వేలంలో సరికొత్త రికార్డు!**

**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ చరిత్రలో మరో అద్భుతం నమోదైంది. ఐటీ కారిడార్‌కు గుండెకాయ వంటి రాయదుర్గం ప్రాంతంలో భూమి ధరలు ఊహకందని రీతిలో పలికాయి. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీ–ఐఐసీ) నిర్వహించిన భూవేలానికి అంతర్జాతీయ స్థాయిలో స్పందన లభించింది. ఇక్కడ ఎకరం భూమి ఏకంగా రూ. 237 కోట్ల ధర పలికి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. నగరంలోని రాయదుర్గం పాన్ మక్తా పరిధిలోని సర్వే నంబర్ 83/1లో ఉన్న 6 ఎకరాల 29 గుంటల భూమిని విక్రయించేందుకు టీజీఐఐసీ గురువారం వేలం నిర్వహించింది. ఈ వేలంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు, డెవలపర్లు పోటీ పడ్డారు. తీవ్రమైన పోటీ మధ్య బిడ్డింగ్ సాగగా, చివరికి ఎకరా ధర రూ. 237 కోట్లకు చేరుకుంది. నిజానికి, గతేడాది ఇదే రాయదుర్గం ప్రాంతంలో జరిగిన భూవేలంలో ఎకరా రూ. 177 కోట్లు పలికినప్పుడే అది పెద్ద సంచలనంగా మారింది. అయితే, తాజాగా జరిగిన వేలంలో ఆ పాత రికార్డు తుడిచిపెట్టుకుపోయింది. కేవలం ఏడాది కాలంలోనే ఎకరాకు అదనంగా మరో రూ. 60 కోట్లు పెరగడం గమనార్హం. దీనిని బట్టి హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో భూమికి ఉన్న డిమాండ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ వేలంలో పలికిన ధరలు చూస్తుంటే రానున్న రోజుల్లో గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ మార్కెట్ మరింత పుంజుకునే అవకాశం కనిపిస్తోంది.

# ఏపీ మద్యం కుంభకోణం కేసు.. విజయసాయిరెడ్డిని ఈడీ విచారణ

**బలగం టీవి, హైదరాబాద్**



ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సుమారు ఏడున్నర గంటల పాటు విచారించారు. బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయంలో బుధవారం ఈ విచారణ జరిగింది.

విచారణ అనంతరం మీడియాతో మాట్లాడిన విజయసాయిరెడ్డి.. మద్యం పాలసీ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ కేసులో తాను ఎవరి పేర్లనూ అధికారులకు చెప్పలేదని పేర్కొన్నారు. మద్యం కుంభకోణానికి సంబంధించిన పూర్తి వివరాలు రాజ్ కెసిరెడ్డికే తెలుసని మాత్రమే చెప్పానని తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా గతంలో స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లలోని డేటాను ఈడీ అధికారులు పరిశీలించారని వెల్లడించారు. తన ఫోన్‌లోని సమాచారం బదిలీ చేసుకోవడానికే అధికారులు పిలిచారని, లోపల పెద్దగా ప్రశ్నలు లేదా విచారణ జరగలేదని అన్నారు. తమకు అవసరమైన సమాచారం తన ఫోన్‌లో ఉండవచ్చనే ఉద్దేశంతో డేటాను తీసుకున్నారని పేర్కొన్నారు. మద్యం పాలసీ ఎలా రూపొందింది, కుంభకోణం ఎలా జరిగిందనే విషయాలు రాజ్ కెసిరెడ్డికే తెలుసని మరోసారి స్పష్టం చేశారు. ఇప్పటివరకు తాను ఆయన పేరు తప్ప మరెవరి పేరూ చెప్పలేదని తెలిపారు. సిట్ అధికారులకైనా, ఈడీ అధికారులకైనా ఇదే విషయం వెల్లడించినట్లు చెప్పారు. తనను ఎవరు లక్ష్యంగా చేసుకున్నా భయపడే వ్యక్తిని కాదని వ్యాఖ్యానించిన విజయసాయిరెడ్డి.. తిరుమల వెంకన్న సాక్షిగా తాను ఎలాంటి తప్పు చేయలేదని పేర్కొన్నారు.



# ప్రభుత్వ విప్‌ను కలిసిన బోయినిపల్లి మండల అధ్యక్షులు సువీన్ యాదవ్

**బలగం టీవి, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కొమ్మనబోయిన సువీన్ యాదవ్ గురువారం వేములవాడ శాసనసభ్యులు మరియు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సువీన్ యాదవ్‌ను సాదరంగా ఆహ్వానించి, శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేయాలని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సువీన్ యాదవ్‌కు ప్రభుత్వ విప్ దిశానిర్దేశం చేశారు. ఈ భేటీ సందర్భంగా ఆది శ్రీనివాస్ తన పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సువీన్ యాదవ్ కుటుంబంతో తమకు దశాబ్దాలుగా ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. ముఖ్యంగా మల్లేష్ యాదవ్‌తో ఉన్న సడలని బంధాన్ని, నాటి రాజకీయ మరియు వ్యక్తిగత ప్రయాణాన్ని ప్రస్తావిస్తూ, పార్టీ కోసం మరియు ప్రజా సేవ కోసం ఆ కుటుంబం చేసిన కృషిని కొనియాడారు. అదే నిబద్ధతతో సువీన్ యాదవ్ కూడా ప్రజల్లో ఉంటూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తడగొండ గ్రామ సర్పంచ్ ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ చేపూరి వెంకటేష్, మైనారిటీ నాయకులు మహమ్మద్ హుస్సేన్, నూతనంగా ఎంపికైన ఆత్మ కమిటీ మెంబర్ గుడి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

**బలగం, టీవీ ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండలంలోని ఇటీవల మృతి చెందిన వెల్జిపురం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గొల్లకోమటి శంకర్ తల్లి ఎల్లవ్వ,సోషల్ మీడియా కన్వీనర్ సుధగోని రవీందర్ గౌడ్ తండ్రి మీనయ్య మృతి చెందగా మానకొండూర్ ఎంఎల్ఏ కవ్వంపల్లి సత్యనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించి, కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చి మనోధైర్యాన్ని నింపారు.ఏమ్మెల్యే వెంట సర్పంచ్ నాయిని నవీన్ కుమార్ మాజీ ఎంపీపీలు వూట్కూరి వెంకటరమణారెడ్డి, గుడిసె ఐలయ్య, , ఉప సర్పంచ్ కంకణాల శ్రావణి నరేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ గుండా వెంకటేశం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కంకణాల రాంప్రసాద్ రెడ్డి, బొజ్జ శ్రీనివాస్, బొల్లారం పరుశురాములు, వేములవాడ రమణాచారి, సోనవేని పర్శరాములు, వేములవాడ శివ, వంగపల్లి నవీన్ రెడ్డి, గొల్ల కోమటి బాలయ్య, సోనవేని ఎల్లయ్య, సోమిరెడ్డి అనిల్ రెడ్డి, కుమ్మరి ప్రశాంత్ తదితరులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## 638 అడుగులకు చేరిన
# మూసీ జలాశయ నీటిమట్టం

**బలగం టీవి, కేతేపల్లి**

మూసీ జలాశయంలో నీటిమట్టం క్రమంగా పెరుగుతూ ప్రస్తుతం 638 అడుగులకు చేరుకుంది. ఎగువ ప్రాంతాలు, హైదరాబాద్ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో కారణంగా ప్రాజెక్టులో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. 645 అడుగులు (4.46 టీఎంసీలు) పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం కలిగిన ఈ జలాశయంలో, యాసంగి సాగు కోసం నీటి విడుదల పూర్తయిన అనంతరం ఏప్రిల్ మొదటి వారంలో నీటిమట్టం 624 అడుగుల కనిష్ట స్థాయికి పడిపోయింది. అయితే అప్పటి నుంచి ఎగువ ప్రాంతాల నుంచి 500 క్యూసెక్కులకు తగ్గకుండా ఇన్‌ఫ్లో వస్తుండటంతో నీటిమట్టం క్రమంగా పెరుగుతూ పూర్తిస్థాయి స్థాయికి చేరువవుతోంది. ప్రస్తుతం జలాశయంలో 2.77 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతాల నుంచి ప్రస్తుతం 337 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది.

ఇదిలా ఉండగా, ప్రాజెక్టు కుడి ప్రధాన కాల్వకు నీటిని విడుదల చేసే షట్టర్ దెబ్బతినడంతో కొంతకాలంగా నీటి వృథా జరుగుతోందని ఆయకట్టు రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటిమట్టం కనిష్ట స్థాయిలో ఉన్న సమయంలోనే షట్టర్‌కు మరమ్మతులు చేపట్టాల్సిందని వారు సూచిస్తున్నారు.

# నీట్ రీటెస్ట్‌పై కేంద్రం ఫోకస్..

- **పీఎంఓ నేరుగా పర్యవేక్షణ**

**బలగం టీవి, న్యూఢిల్లీ**




దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 21న నిర్వహించనున్న నీట్ రీటెస్ట్‌లో ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోకుండా పటిష్ట చర్యలు చేపడుతోంది. ఈసారి పరీక్ష నిర్వహణ మొత్తం ప్రక్రియను ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) నిశితంగా పర్యవేక్షించనున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

దిల్లీలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నట్లు సమాచారం. సుమారు 40 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా, ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్, పీఎంఓ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నీట్ రీటెస్ట్‌కు సంబంధించిన పేపర్ తయారీ, ప్రింటింగ్, రవాణా, పరీక్షా కేంద్రాలకు తరలింపు, ఫలితాల ప్రకటన వరకు ప్రతి దశను పీఎంఓ పర్యవేక్షించనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ వ్యవహారాన్ని ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా మానిటర్ చేస్తున్నారని, పరీక్షకు సంబంధించిన ప్రతి అప్‌డేట్‌ను తెలుసుకుంటున్నారని పేర్కొన్నాయి.

మే 3న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించిన నీట్–యూజీ 2026 పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ అయ్యిందన్న ఆరోపణల నేపథ్యంలో మే 12న రద్దు చేయబడింది. అనంతరం జూన్ 21న రీటెస్ట్ నిర్వహిస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించారు. వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు కూడా కేంద్రం వెల్లడించింది.

మే 3న దేశవ్యాప్తంగా 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో 5,400కు పైగా కేంద్రాల్లో నిర్వహించిన నీట్ యూజీ పరీక్షకు 22 లక్షల మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యారు. పేపర్ లీక్ కారణంగా పరీక్ష రద్దవడంతో అభ్యర్థులు మరోసారి జూన్ 21న పరీక్ష రాయనున్నారు.

# నాలుగు రాష్ట్రాలకు బీజేపీ కొత్త అధ్యక్షుల నియామకం

**బలగం టీవి, న్యూఢిల్లీ**

నాలుగు రాష్ట్రాల బీజేపీ రాష్ట్ర శాఖలకు నూతన అధ్యక్షులను నియమిస్తూ పార్టీ జాతీయాధ్యక్షుడు నితిన్ నబిన్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. హర్యానా బీజేపీ అధ్యక్షురాలిగా అర్చనా గుప్తా, ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా హర్ష్ మల్హోత్రా, పంజాబ్ అధ్యక్షుడిగా సర్దార్ కేవల్ సింగ్ ధిల్లాన్, త్రిపుర బీజేపీ అధ్యక్షుడిగా అభిషేక్ దేవ్‌రాయ్ నియమితులయ్యారు.

ఇటీవల పశ్చిమ బెంగాల్, అసోం, పుదుచ్చేరిలో పార్టీ విజయాల అనంతరం బీజేపీ ఇప్పుడు మిగతా రాష్ట్రాల్లో సంస్థాగత బలోపేతంపై దృష్టి సారించింది. ఈ క్రమంలో కీలక నిర్ణయం తీసుకుంటూ నాలుగు రాష్ట్రాలకు కొత్త అధ్యక్షులను ప్రకటించింది. ఇంతకుముందు ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా వీరేంద్ర సచ్‌దేవా, పంజాబ్ అధ్యక్షుడిగా సునీల్ ఝుకార్, హర్యానా అధ్యక్షుడిగా మోహన్ లాల్ బదోలి, త్రిపుర అధ్యక్షుడిగా రజీబ్ భట్టాచార్జీ కొనసాగుతున్నారు. వారి స్థానాల్లో కొత్త నాయకత్వాన్ని నియమించింది. పంజాబ్ అధ్యక్షుడిగా ఎంపికైన కేవల్ సింగ్ ధిల్లాన్ గతంలో ఎమ్మెల్యేగా పనిచేశారు. ఆయన తొలుత కాంగ్రెస్‌లో ఉండి అనంతరం బీజేపీలో చేరారు. పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్‌కు సన్నిహితుడిగా గుర్తింపు పొందారు. ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా నియమితులైన హర్ష్ మల్హోత్రా తొలిసారి ఎంపీగా గెలుపొందారు. పార్టీ కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తూ ప్రస్తుతం కేంద్ర మంత్రిగా కొనసాగుతున్నారు. హర్యానా అధ్యక్షురాలిగా ఎన్నికైన అర్చనా గుప్తా రాష్ట్ర బీజేపీ జనరల్ సెక్రటరీగా పనిచేశారు. ఆమెకు ఈసారి పార్టీ అధ్యక్షురాలిగా పదోన్నతి లభించింది. త్రిపుర బీజేపీ అధ్యక్షుడిగా నియమితులైన అభిషేక్ దేవ్‌రాయ్ రాష్ట్రంలోని కీలక నియోజకవర్గం మతార్బారి నుంచి గెలుపొందిన నేతగా గుర్తింపు పొందారు.

# రైతులపై తుగ్లక్ పాలసీలు అమలు చేస్తున్నారు

**ఎంపీ ఈటల రాజేందర్**

**బలగం టీవి, హైదరాబాద్**



కౌలు రైతులు ధాన్యం అమ్ముకునే విషయంలో ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు తుగ్లక్ పాలసీలుగా ఉన్నాయని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. "రైతు గోస -- బీజేపీ భరోసా" కార్యక్రమంలో భాగంగా నిర్మల్ జిల్లా కడెం, ఖానాపూర్ ప్రాంతాల్లో రైతులతో ఈటల రాజేందర్, బీజేపీ శాసనసభ పక్ష నాయకుడు మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఈటల.. కౌలు రైతులకు మార్కెట్‌లో ధాన్యం అమ్ముకునేందుకు భూమి యజమాని వచ్చి థంబ్ వేయాలని నిబంధన పెట్టడం అమానుషమన్నారు.

"భూమి యజమాని ముంబైలో, దుబాయ్‌లో, హైదరాబాద్‌లో ఉంటే ఎలా వస్తాడు? ఈ విషయం ప్రభుత్వం ఆలోచించిందా?" అని ప్రశ్నించారు. ఇలాంటి మెదడు లేని విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారని, దమ్ముంటే ఇప్పుడే రాజీనామా చేసి ఎన్నికలకు రావాలని ఈటల సవాల్ విసిరారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు తొమ్మిదిన్నరేళ్లు పట్టిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఇప్పటికే తీవ్ర వ్యతిరేకత వచ్చిందని వ్యాఖ్యానించారు. పంట దిగుబడులపై సరైన అంచనాలు లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించిన ఆయన.. రైతులకు అవసరమైన బస్తాలు, హమాలీలు, లారీలు, గోదాములు ముందుగానే ఎందుకు ఏర్పాటు చేయలేకపోయారని ప్రశ్నించారు. రైతులకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికే తాము యాత్ర చేపట్టామని, దానిని రాజకీయంగా చూపించడం సరికాదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రైతుల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవాలని సూచించారు.

"రైతులను ఆదుకోవాల్సింది పోయి ఎదురుదాడి చేయడం మంచిది కాదు. చివరి గింజ కొనేవరకు రైతులకు బీజేపీ అండగా ఉంటుంది" అని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ శాసనసభ పక్ష నాయకుడు మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రామారావు పటేల్, వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీలు మల్కా కొమురయ్య, అంజిరెడ్డి, ఏవీఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రాన్స్‌లో 'కోడ్ నోయిర్' చట్టానికి ముగింపు..

**రెండు శతాబ్దాల బానిసత్వ చిహ్నం రద్దు**

**బలగం టీవి, పారిస్**



ఫ్రాన్స్‌లో బానిసత్వ యుగానికి ప్రతీకగా నిలిచిన చారిత్రాత్మక 'కోడ్ నోయిర్' (నల్ల చట్టం)కు చివరకు ముగింపు పలికింది. రాజరిక వ్యవస్థలో మనుషులను పాలకుల ఆస్తులుగా పరిగణించే ఈ చట్టాన్ని రద్దు చేస్తూ తీసుకొచ్చిన బిల్లుకు ఫ్రాన్స్ పార్లమెంట్ దిగువ సభ ఆమోదం తెలిపింది. దీంతో శతాబ్దాలుగా విమర్శలకు గురైన ఈ చట్టం చరిత్ర పుటల్లోకే పరిమితమైంది.

'కోడ్ నోయిర్' పేరుతో ఈ చట్టాన్ని 1685లో ఫ్రాన్స్ రాజు లూయిస్ పాలనలో అమల్లోకి తీసుకువచ్చారు. ఫ్రాన్స్ వలస ప్రాంతాల్లో నివసించే నల్లజాతి ప్రజలను రాజరిక కుటుంబాలు, పాలక వర్గాల బానిసలుగా మార్చేందుకు ఈ చట్టం ఉపయోగించబడింది. బానిసలను కొనుగోలు, విక్రయాలు చేయడం, శారీరక హింసలు, కొరడా దెబ్బలు, అత్యాచారాలు వంటి అమానుషాలకు ఈ చట్టం చట్టబద్ధత కల్పించిందని చరిత్రకారులు పేర్కొంటున్నారు. ఈ చట్టాన్ని రద్దు చేసేందుకు ఎంపీ స్టీవీ గుస్తావే బిల్లును ప్రవేశపెట్టారు. బానిసల వంశానికి చెందిన వ్యక్తిగా ఆయన భావోద్వేగంతో సభలో ప్రసంగించారు. "మనిషి స్వేచ్ఛతో పుడతాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ బానిసగా జీవించకూడదు" అని పేర్కొన్నారు.

సభలో చర్చ అనంతరం ఓటింగ్ నిర్వహించగా, 25–40 ఓట్ల తేడాతో బిల్లుకు ఆమోదం లభించింది. కేవలం ఏకగ్రీవ ఆమోదంతో కాకుండా చర్చించి, చరిత్రలో జరిగిన దారుణాలను గుర్తుచేసుకుంటూ ఈ చట్టాన్ని రద్దు చేయడం ఎంతో ముఖ్యమని స్టీవీ గుస్తావే వ్యాఖ్యానించారు. ఈ నిర్ణయంతో ఫ్రాన్స్ స్వేచ్ఛ, సమానత్వం, మానవ హక్కుల పరిరక్షణకు మరింత కట్టుబడి ఉన్న దేశంగా మరోసారి ప్రపంచానికి సందేశం ఇచ్చిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# కెన్యాలో బాలికల హాస్టల్‌లో అగ్నిప్రమాదం..



**-16 మంది విద్యార్థినులు సజీవ దహనం**

**-80 మంది విద్యార్థినులకు గాయాలు**

**బలగం టీవి, నైరోబి**

తూర్పు ఆఫ్రికా దేశమైన కెన్యాలో విషాదకర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గిల్గిల్ ప్రాంతంలోని ఓ బాలికల బోర్డింగ్ స్కూల్ హాస్టల్ డార్మెటరీలో మంటలు చెలరేగడంతో 16 మంది విద్యార్థినులు సజీవ దహనం అయ్యారు. ఈ ఘటనలో మరో 80 మందికి పైగా విద్యార్థినులు గాయపడినట్లు అధికారులు వెల్లడించారు.

కెన్యా విద్యాశాఖ మంత్రి జులియస్ ఓగాంబా తెలిపిన వివరాల ప్రకారం.. ఉతుమిషి స్కూల్ హాస్టల్‌లో విద్యార్థినులు భోజనం చేసిన అనంతరం డార్మెటరీలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. మంటలు వేగంగా వ్యాపించడంతో లోపల చిక్కుకున్న పలువురు బయటకు రావడానికి వీలు లేకపోయింది. ఘటన సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, సహాయక బృందాలు వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన విద్యార్థినులను సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రభుత్వ ఆధ్వర్యంలోని పాఠశాలలో సుమారు 800 మంది విద్యార్థినులు చదువుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. వీరిలో పలువురు పోలీసు అధికారుల కుమార్తెలు కూడా ఉన్నట్లు సమాచారం. అగ్నిప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. దేశవ్యాప్తంగా ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది.

